ప్రజాశక్తి

శనివారం 3 డిసెంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బిజెపిలో ముసలం

- చిచ్చుపెట్టిన వివిపి పాస్‌ల వ్యవహారం
- మోడీ సభకు భారీ వసూళ్లపై తలెత్తిన విభేదాలు
- తోట నగేష్ రాజీనామాతో బయటపడ్డ లోగుట్టు

తోట నగేష్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రధాని మోడీ విశాఖ పర్యటన బిజెపిలో చిచ్చు తెచ్చిపెట్టింది. నవంబరు 12న విశాఖలో జరిగిన మోడీ సభను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. కానీ మోడీ సభ పేర చందాల వసూలు మొదలుకొని విఐపి పాస్‌లను పార్టీతో సంబంధంలేని వ్యక్తులకు లక్షల రూపాయలకు బిజెపి నాయకులు అమ్ముకున్నారన్న ఆరోపణలు ఆ పార్టీలోనే గుప్పు మంటున్నాయి. ప్రధాని సభకు వచ్చిన 70 పాస్‌ల్లో అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షునికి కూడా వివిసి పాస్ ఇవ్వకుండా, పార్టీతో ఏ మాత్రమూ సంబంధంలేని ఓ వ్యాపారికి, పోలీసు కేసులున్న ఓ వ్యక్తికి పాస్‌లిచ్చి మోడీని కలిసేలా చేశారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మోడీ సభను ఉపయోగించుకొని నగరానికి చెందిన ఓ బిజెపి నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించుకొని కంపెనీల నుంచి భారీగా చందాలు వసూలు చేశాడన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వాన్ని విస్మరించి ఇతరులకు పాస్‌లు అమ్మడం, చందాల వసూళ్లను విభేదించిన ఉమ్మడి విశాఖపట్నం గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేష్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ పదవికి రాజీనామా చేశారు. పార్టీలో సీనియర్లకు పాస్‌లు ఇవ్వకపోవడంపై ఆ పార్టీలో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. పార్టీ సభ్యత్వానికి కాకుండా రాష్ట్ర కార్యవర్గ పదవికి రాజీనామా చేసిన లేఖను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు పంపించడంతో చర్చనీయాంశంగా మారింది.

ప్రజా సమస్యలపై పార్టీ స్పందించిన తీరు విసుగు తెప్పించినట్లు నగేష్ చెబుతున్నారు. సహకార చక్కెర ఫ్యాక్టరీల రైతుల బకాయిలు, హెటిరో డ్రగ్స్ కంపెనీ పైపులైన్ నిర్మాణానికి వ్యతిరేకంగా 300 రోజులకుపైగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నా పార్టీ పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. రైతులు, మత్స్యకారుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామన్నా పార్టీ నాయకత్వం స్పందించలేదన్నారు. పాయకరావుపేటలోని చేనేత కార్మికుల సొసైటీకి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికంగా సహకారం అందించేందుకు కనీస ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. ఇంకా.. బిజెపి నాయకత్వంపై నగేష్ తీవ్రమైన విమర్శలే చేశారు. స్మార్ట్ విలేజ్ పేరుతో ఉద్యోగాలిస్తామని చేసిన రూ.300 కోట్లు వసూళ్లపై బినామీలు బయటపడాలంటే సిబిసిఐడి కాకుండా సిబిఐతో దర్యాప్తు చేయించి, ఇడి అటాచ్‌మెంట్ చేయాలని కూడా ఆయన అన్నారు. స్థానిక నాయకత్వానికి కనీస సమాచారమివ్వకుండా కంపెనీల నుంచి చందాలు వసూలు చేసిన విషయం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పార్టీ నాయకత్వం స్పందించలేని పరిస్థితుల్లో ఉందని తెలిపారు. ప్రధాని సభకు పార్టీతో సంబంధంలేని వ్యక్తులకు పాస్‌లు ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు వారు స్పానర్ చేశారని నగరానికి చెందిన ఉత్తరాంధ్రతో సంబంధాలున్న ఓ పెద్ద మనిషి ఇచ్చిన సమాధానంపై

మిగతా 2లో..

మీడియాతో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

సిబిసిఎన్‌సి స్థలంపై కుట్రలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిరిపురంలోని సిబిసిఎన్‌సి స్థలం పూర్తిగా ప్రభుత్వానిదేనని, దాన్ని కాజేసేందుకు నేడు కుట్రలు జరుగుతున్నాయని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.60 కోట్ల విలువైన మొత్తం స్థలాన్ని కాజేయడానికి అధికార వైసిపి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విపక్షాలు ఆందోళన చేయడంతో 3600 గజాల స్థలం సోషల్ వెల్ఫేర్‌కు చెందినదిగా ఇటీవల బోర్డు పెట్టారన్నారు. ఇది కాకుండా ఇంకా మిగిలి ఉన్న ఐదు ఎకరాల స్థలాన్ని కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కుట్రలో అధికార పార్టీ నేతలు, అధికారులు ఉన్నారన్నారు. కుట్రలో భాగంగానే ట్రస్టు మెంబర్లను వాటాదారులుగా సృష్టించారన్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఐదు ఎకరాలతో కలిపి మొత్తం ప్రభుత్వ స్థలమని స్పష్టంగా ఉందన్నారు. ఇది వాస్తవమని తెలిసినప్పటికీ జివిఎంసి కమిషనర్ ప్రభుత్వ స్థలానికి టిడిఆర్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై పూర్తిగా విచారణ జరిపించాలన్నారు. ఆ స్థలంలో నిర్మాణాలు జరక్కుండా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నేవీ రిహార్సల్స్

▶ వార్త మెయిన్‌లో..

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

▶ వార్త 3లో..

పార్కుల్లో పెంచిన ఫీజుల రద్దుకు ధర్నా

▶ వార్త 2లో..

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ

భూములను పరిరక్షించాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ భూములను పరిరక్షించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనకాపల్లి మండలంలోగల తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. ఇదికాక యలమంచిలి నియోజకవర్గ పరిధిలో మరో 10 చెరకు తూనిక కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఒక్కొక్కటి ఒక ఎకరా ఉంటుందన్నారు. ఫ్యాక్టరీ భూముల విలువ సుమారు రూ.260 కోట్లు పైగా ఉంటుందని అన్నారు. పాదయాత్ర సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి ఫ్యాక్టరీని ఆధునికీకరించి తెరిపిస్తామని హామీనిచ్చారన్నారు. కానీ ఆచరణలో ఫ్యాక్టరీనే పూర్తిగా మూసివేసారని తెలిపారు. ఇప్పుడు ఫ్యాక్టరీ సంబంధింత భూములపై రాజకీయ నాయకుల కన్నుపడి కబ్జాలకు గురౌతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. వీటిపై అధికారులు స్పందించి ఫ్యాక్టరీ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యార్డు సుమారు 3 ఎకరాలు ఉందన్నారు. నేడు ఈ యార్డు స్థలంలో కూరగాయలు, చేపల దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. ఆ దుకాణాల నుంచి నెలవారీ వసూళ్లు చేస్తున్నట్లు స్థానికంగా వార్తలు కూడా వస్తున్నాయన్నారు. కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద సుమారు 1.15 ఎకరాల చెరుకు తూనిక కేంద్రం ఉందని, మూడేళ్ళ నుంచి చెరుకు క్రషింగ్ లేకపోవడంతో ఆ భూముల్లో ఇటుకల బట్టీ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇవేగాక అనేక ప్రాంతాల్లో ఫ్యాక్టరీకి చెందిన భూములు ఉన్నాయన్నారు. వాటిని ఆక్రమించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కొందరు తమ రాజకీయ

మిగతా 2లో..

'ఉక్కు' రక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే..

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే అధికంగా ఉందని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 610వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఆటో కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగాన్ని కాపాడుతామని, నల్లధనాన్ని వెలికి తీసి దేశ ప్రజలందరికీ పంచుతామని చెప్పిన మోడీ నేడు పబ్లిక్ సెక్టార్‌ను పూర్తిగా ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో ఉన్నందున అమ్మి వేస్తున్నట్లు బిజెపి చెప్పడం సరికాదన్నారు. నష్టాల్లో ఉన్న పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులు ఎందుకు కొనుగోలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రైవేటీకరణ చర్యలను

దీక్షల్లో కూర్చున్న ఆటో కార్మికులు

రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా అడ్డుకోవాలని కోరారు. కార్మిక, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాయని స్పష్టం చేశారు. విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.జగన్, ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. దీక్షల్లో ఆటో రిక్షా కార్మిక సంఘం నాయకులు సత్తిబాబు, సురేష్, గాడు సూరిబాబు, శ్రీధర్, ఎస్.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

బిజెపిలో ముసలం

నగేష్ అసంతృప్తి వ్యక్తంచేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధాని మోడీ రాకను కొంతమంది బిజెపి నాయకులు సొమ్ము చేసుకున్నారన్న విషయం బయటకు పొక్కడంతో పార్టీలో పెద్ద దుమారం రేగింది.

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ భూములను పరిరక్షించాలి

పలుకుబడిని ఉపయోగించి భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ భూములను, ఆస్తులను సంరక్షించాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, జిల్లా అధికారులు వెంటనే స్పందించి తుమ్మపాల సుగర్స్ భూములపై నిఘా ఉంచి పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

ఎరీనా పార్కు వద్ద ఆందోళనకు దిగిన సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

పార్కుల్లో పెంచిన ఫీజుల రద్దుకు ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ నిర్వహిస్తున్న పార్కుల్లో భారీగా ఫీజులు విధించి వాకర్లు, ప్రజలపై భారాలు వేయడాన్ని ఖండిస్తూ సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా చేపట్టారు. జివిఎంసి 18వ వార్డులో ఉన్న ఎరీనా పార్కు వద్ద జరిగిన ఈ ధర్నాను ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడారు. ప్రజల వినోదానికి, ఆరోగ్యానికి తోడ్పడే వాకింగ్ పైన డబ్బులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. పట్టణ సంస్కరణల పేరుతో పార్కుల్లో కూడా ఫీజులు పెట్టి ప్రజల జేబులకు చిల్లులు పెట్టడం సరైంది కాదన్నారు. రూ.5 నుంచి రూ.200 వరకూ ఫీజులు విధించడం తుగ్లక్ పాలనేనని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చెత్తపన్ను, మురుగునీటి పన్ను, ఆస్తి పన్ను వంటి అనేక పన్నులు విధించి ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులు పాలుజేస్తోందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజల ఆరోగ్యాలు క్షీణించి హాస్పటళ్ల పాలవుతున్నారన్నారు. జబ్బులు తగ్గాలంటే వాకింగ్, జాగింగ్, రన్నింగ్ వంటివి చేయాలని డాక్టర్లు చెబుతున్నారని గుర్తు చేశారు. పార్కుల్లోనూ, వాకర్స్ ట్రాక్‌లపైనా ప్రజలు నడిచే హక్కు, వినోదాన్ని పొందే హక్కు ప్రభుత్వం కల్పించాలన్నారు. అంతేతప్ప పార్కుల్లో ఫీజులు పెట్టి డబ్బులు దండుకోవడం శవాలపై పేలాలు ఏరుకోవడమే అవుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం, విఎంఆర్‌డిఎలు ఆ ఫీజులు రద్దుచేయాలని, లేని పక్షంలో ప్రజాఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా సంఘాల నాయకులు ఎం.చంటి, జె.కోదండ, కె.కుమారి, సంతోష్, కుసుమ, సెక్టర్ 6 కాలనీ అసోసియేషన్ నాయకులు లక్ష్మణరావు, మాజీ ఎసిపి ప్రేమ్‌బాబు పాల్గొన్నారు.

ఆప్కాస్‌తో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం ఆప్కాస్ పేరుతో మున్సిపల్ కార్మికుల పొట్టలు కొడుతోందని, మున్సిపల్ పరిపాలనను అస్తవ్యస్తం చేస్తోందని జివిఎంసి ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటియుసి) గౌరవ అధ్యక్షులు పడాల రమణ అన్నారు. ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐదో రాష్ట్ర మహాసభలు ఈ నెల 7, 8, 9 తేదీలలో ఒంగోలులో జరగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుపై కక్ష సాధింపు చర్యలు తగవు

- వామపక్ష పార్టీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డాక్టర్ పొన్నాడ శ్రీనివాసరావుపై ఎయు యాజమాన్యం కక్ష సాధింపు చర్యలు విడనాడాలని, తక్షణం అతని క్వార్టర్‌కు విద్యుత్, మంచినీరు సదుపాయం కల్పించాలని వామపక్ష పార్టీలు వీసీ పివిజిడి ప్రసాదరెడ్డిని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ విశాఖ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు గణేష్‌పాండా, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, ఎస్‌యుసిఐ (సి) రాష్ట్ర నాయకులు ఎస్.గోవిందరాజులు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శ్రీనివాసరావు ఎయులో తొమ్మిదేళ్లుగా టీచింగ్ ఫ్యాకల్టీగానూ, ఎంహెచ్‌ఆర్‌డికి చెందిన ఉన్నత్ భారత్ అభియాన్ కో-ఆర్డినేటర్‌గానూ పనిచేస్తున్నారన్నారు. ఆనాటి వైస్ ఛాన్సలర్ ఆదేశాలకు అనుగుణంగా ఆయనకు బీచ్ శాండ్‌లో యూనివర్సిటీకి చెందిన నివాస క్వార్టర్ నెంబర్ 18ను కేటాయించారన్నారు. ఇటీవల ప్రస్తుత వీసీ వ్యక్తిగత కక్షతో అతనిని ఉద్యోగం నుంచి అక్రమంగా తొలగించారన్నారు. ఈ చట్ట వ్యతిరేక ఉద్యోగ తొలగింపుపై హైకోర్టులో కేసు నడుస్తుండగా మూడు రోజుల క్రితం ఎటువంటి ముందస్తు నోటీస్ కూడా ఇవ్వకుండా క్వార్టర్‌కు విద్యుత్, మంచినీటి కనెక్షన్లు తొలగించారన్నారు. ఇంట్లో ఇద్దరు ఐదేళ్లలోపు చిన్న పిల్లలు ఉన్నారన్నారు. అయినప్పటికీ అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడటం మానవ హేయమైన చర్యని అన్నారు. ఈ కక్ష సాధింపు చర్యలను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. వెంటనే శ్రీనివాసరావు క్వార్టర్‌కు విద్యుత్, మంచినీటి కనెక్షన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒక ఉన్నతమైన విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా ఉండి తప్పుడు పద్ధతులకు పాల్పడటం తగని పనని, ఇటువంటి చర్యలు యూనివర్సిటీకి మాయని మచ్చని అన్నారు. గతంలో యూనివర్సిటీ టీచింగ్‌లో కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న అనేక మందిని అర్థాంతరంగా కక్షతో తొలగించగా వారంతా నేడు వీధినపడ్డారన్నారు. కొన్ని డిపార్టుమెంట్లను మూసివేశారని, విద్యార్థుల ఫీజులు భారీగా పెంచారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు తీవ్ర హాని చేస్తున్నారని తెలిపారు. అవసరమైన టీచింగ్ ఫ్యాకల్టీని నియమించకుండా విశ్వ విద్యాలయాన్ని అడడమిక్‌గా బలహీనం చేస్తున్నారన్నారు. మోడీ రాక సందర్భంగా వందల చెట్లను తొలగించి విధ్వంసం సృష్టించారన్నారు. విశ్వవిద్యాలయాన్ని ఒక రాజకీయ కేంద్రంగా మార్చేశారన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నియామకాలు చేస్తున్నారని తెలిపారు. తాజాగా నేవీ మేళా పేరుతో ఎయు ఉద్యోగుల క్వార్టర్స్‌ను ఖాళీ చేయించేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ చర్యలన్నీ విశ్వ విద్యాలయంలో వున్న విద్యార్థులకు, అధ్యాపక, అధ్యాపకేతరులకు తీవ్ర హాని కలిగించేవిగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అప్రజాస్వామిక, నియంతృత్వ చర్యలు విడనాడాలని వీసీకి హితవుపలికారు.

మంత్రి అమర్‌నాథ్‌కు అరుదైన గౌరవం

మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హోదా - రాష్ట్రపతి పర్యటన బాధ్యతలు అప్పగింత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈ నెల 4న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖలో జరిగే నేవీ డేలో ముఖ్య అతిథిగా పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఆమె విశాఖ నగరానికి వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లేంతవరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఆమె వెంట ఉంటారు. సాధారణంగా రాష్ట్రపతికి గవర్నర్, ముఖ్యమంత్రి విమానాశ్రయంలో స్వాగతం పలకాల్సి ఉంటుంది. రాష్ట్రపతి ఢిల్లీ నుంచి నేరుగా విజయవాడ వస్తారు. అక్కడే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రపతికి స్వాగతం పలుకుతారు. దీంతో విశాఖలో జరిగే రాష్ట్రపతి కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యతలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విశాఖ విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలికే దగ్గర నుంచి, విశాఖ నుంచి రాష్ట్రపతి తిరిగి వెళ్లేంతవరకు ముఖ్యమంత్రి స్థానంలో ప్రభుత్వ ప్రతినిధిగా అమర్‌నాథ్ వ్యవహరించనున్నారు. నేవీ డేలో కూడా రాష్ట్రపతితో పాటు మంత్రి అమర్‌నాథ్ దంపతులు పాల్గొంటారు.

మహిళల్లో ప్రశ్నించేతత్వం పెరగాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మహిళల్లో ప్రశ్నించేతత్వం మరింత పెరగాలని సీనియర్ న్యాయవాది, మహిళా హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న జహ అరా అన్నారు. మహిళలలో విజ్‌డమ్ పెరగనంతవరకు, చదువులు మార్కుల కోసం కాకుండా, సోషల్ సైన్స్ పెరిగే విధంగా దోహదపడనంతవరకు ఎన్ని చట్టాలు చేసినా ఉపయోగం ఉండదని తెలిపారు. ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్ఐసి స్పోర్ట్స్ క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం 'మహిళలపై పెరుగుతున్న దాడులు - ప్రభుత్వ వైఫల్యం - పరిష్కార మార్గాలు' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ దేశంలో ప్రతి 15 నిమిషాలకూ ఎక్కడో ఒకచోట మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. యుపిలో ఆ సంఖ్య మరింత అధికమని తెలిపారు. పురుషులు రోజు రోజుకూ మృగాళ్లుగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులలో కూడా మహిళలకు పూర్తిగా న్యాయం జరగడం లేదని ఆవేదన వెలుబుచ్చారు. అక్కడా పురుషాధిక్య వ్యవస్థనే కొనసాగుతోందన్నారు. సాహిత్యం, సినిమాలు అన్నీ మహిళలను తక్కువ చేసి చూపిస్తున్నాయన్నారు. అడిగితే తప్ప హక్కులు లభ్యం కావడం లేదన్నారు. మహిళను వ్యాపార వస్తువుగా ప్రమోట్ చేస్తున్నారని విమర్శించారు. జనాభాలో 50 శాతం మంది మహిళలు ఉన్నారని, సంపద ఉత్పత్తిలో 80 శాతం వీరిదేనని, అయితే వ్యక్తిగత ఆస్తిలో ఒక శాతం మాత్రమే వీరికి భాగస్వామ్యం ఉందని చెప్పారు. సదస్సుకు వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి.సూర్యప్రభ అధ్యక్షత వహించారు. కో కన్వీనర్ తిరుమల, ఎల్ఐసి ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి, కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

IN THE HON'BLE COURT PRINICIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
S.O.P.No. 36/22

నా క్లయింటు దువ్వి ఉషారాణి, D/o. లేటు రాంబాబు, డో.నెం. 36-98-77, కప్పరాడ కంచరపాలెం, విశాఖపట్నం-530008. పై కోర్టులో సక్ససేన్ సర్టిఫికేట్ (Succession Certificate) SOP లీగల్ హెయిర్ కొరకు కేసు ఫైలు చేసియున్నారు. SOP No. 36/22 విషయంలో ఎవరికి ఎటువంటి ఆక్షేపణలు ఉన్నా మీరు స్వయంగా గాని లాయరుద్వారా గాని **తేది: 12-12-22దిన ఉదయం 10-30 ని॥లకు** కోర్టుకు ఆక్షేపనులు తెలపవలసిందిగా కోరుచున్నాము.

G.ESWARA PRASAD
Advocate, D.No. 36-95-21,
Kancharapalem, NH-5,
Visakhapatnam-530008
Cell : 984973466

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, అమలాపురం
M.V.O.P. No. 32/2022

Between:
ముత్యాల దుర్గాప్రసాద్ ...పిటీషనర్
AND
ముత్యాల హరినాధ్ వగైరాలు -రెస్పాండెంట్స్

1వ రెస్పాండెంట్:
ముత్యాల హరినాధ్, S/o. అమ్మిరాజు, డ్రైవర్ ఆఫ్ మహేంద్రా XUV-500 కార్ B.No. AP 31 CE 8888, R/o. D.No. 9-5-62/1, శివాజీపాలెం, Opp. శివాలయం, పెదవాల్తేరు, విశాఖపట్నం.

పై నెంబరు పిటీషనర్ నష్టపరిహార కేసులో మీ హాజరు నిమిత్తం వాయిదా **తేదీ 16-12-2022 నాటికి కలదు.** సదరు తేదీన పై కోర్టులో **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కొమ్ముల వెంకట బుచ్చిరాజు
అడ్వకేట్
అమలాపురం అమలాపురం
01-12-2022 సెల్: 9989075758

In The Court Of The Vth Additional Junior Civil Judge : Kakinada
I.A.No.16/2019 in O.S.No.416/2019,
O.S.No.416/2019

Between:
Smt. Paila Satyavathi ***...Plaintiff /Petitioner***
AND
Petla Srinivau ***...Defendant /Respondent***

TO:
Petla Srinivasu, S/o. Yerrinaidu (Lorry Driver), Aged 48 Years, Bappiraju, Kothapalli Village, Kotauratla Mandal, Vizag District-531085, A.P.

పై నెంబరు దావాలోను మరియు పిటీషనులోను ప్రతివాది /రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.15-12-2022వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మరియు పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

YANAMALA RAMAM
Kakinada, Advocate, Kakinada.
01-12-22. Cell: 98484 42583

IN THE COURT OF THE MVACT CUM X ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT: AT HYDERABAD
o.p no.: 1719 of 2021

between:
B. Santhi **....petitioner**
and
parathasarathy logistics pvt. ltd.. **....Respondents**

To,
R. Srinivasa Rao S/o. Satyanarayana,
Aged. 45 years, occ. Driver,
R/o. flat no. 2c, Srisainarsimha towers,
narsimhapatnam, gajuwaka,
Vishakapatnam, Andhra Pradesh.

please take notice that the above petitioner had filed the case for grant of conpensation for injureis sustained by name B.Santhi in motor vehicle accident which occurred on 14-03-2021 under the limits of P.S. Nuzvid (R).

the above case is posted to 04-01-2023 at 10-30 AM for your appearance and counter, if, you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
K. ANAND REDDY
D. VENKAT RAMANA
Counsels for the petitioner
flat no. 212, jamuna towers,
opp: Yashoda Hospital,
Malakpet, Hyderabad-36.

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S.65/2019

Between:
Kuna Tirumala Rao ..వాది
And :
V.V.Rajasekhara Raju, Managing Partner, M/S RAJ & RAJ CONSULTANT AND CONSTRACTION, VISAKHAPATNAM. ..ప్రతివాది

To. V.V. Rajasekhara Raju, Managing Partner, M/S RAJ & RAJ CONSULTANT AND CONSTRACTION&SERVICES, D.No 45-58/3/10, Narasimha Nagar, Rushi Enclave, Flot No. 502, VISAKHAPATNAM Town & Dist.

పై వాది మీపై Specific Performance & Sale Agrement దావా వేసియున్నారు. పై దావాలో మీకు పలు మార్లు 2019 నుండి ఇప్పటి వరకు నోటిసు Batta కట్టి శ్రీ కోర్టు వారు పలు మార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోనకుండా తప్పించుకొని చున్నారు. కావున పై దావా **O.S.65/2019 తే.16-12-2022** దికు మీ హాజరు నిమిత్తం వాయిదా పడినది. అందువలన **తే.16-12-2022 దీన** ఉదయం 10.30. ని॥లకు పై కోర్టులో హాజరు కాని పక్షంలో మీ పరోక్షమున తీర్మానించబడునని యందు మూలంగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉతర్వులు మేరకు)
కె.నాగభూషణరావు, న్యాయవాది,
ఫ్రెండ్స్ కాలనీ,శ్రీకాకుళం.
సెల్: **9440149767**

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న వార్డ్ కార్పొరేటర్ సుధ

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతం 61వ వార్డులోని జనతా కాలనీ, మరిడిమాంబ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు గురువారం ఇళ్ల స్థలాల పట్టాలను వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పంపిణీ చేశారు. వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన పట్టాల పంపిణీలో కొల్లి నూకరెడ్డి, దాడి సత్యనారాయణ, బుస అప్పలరెడ్డి, చట్టి నూకరాజు, విజయ్, నరేష్, స్వప్న, కొండలరావు, శ్రీనివాస్, రామకృష్ణ, స్పందన బాబురావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -మాధవధార : 51వ వార్డులో రెండోవిడతలో 105మందికి జగనన్న ఇళ్ల పట్టాలను వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వార్డు పరిధిలో ఇంకా అర్హులైన వారెవరైనా ఉంటే వార్డు వాలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకుంటే అందరికీ ఇళ్ల పట్టాలను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బి తిరుమలరావు, మెట్ట దమయంతి, శ్యామ్, గణేష్, వినోద్, రాణి, సాధు, బాబురావు, సచివాలయం అడ్మిన్ భాను, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీలు నందిని, భవానీ, సంతోష్, స్వామినాయుడు, లక్ష్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి- మాధవధార : మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులకు కారణమైన దోమలు, వాటి లార్వాలను అరికట్టేందుకు ప్రతిశుక్రవారం విధిగా డ్రైడే పాటించాలని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సూచించారు. శుక్రవారం వార్డులో పర్యటించి, పారిశుధ్యం, డ్రైడేఫ్రైడేపై ప్రజలకు తగు సూచనలు చేసి, సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కాలువల్లో పూడుకుపోయిచ చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, మలేరియా సూపర్‌వైజర్ చౌదరి, శానిటేషన్ సూపర్‌వైజర్ చిరంజీవి, సింహాచలం, శానిటేషన్ సెక్రటరీ పార్వతి ,సూర్యనారాయణమ్మ, ప్రదీపిక పాల్గొన్నారు.

శబరిమలకు ఉచిత బస్ సౌకర్యం

సూరిబాబు సమకూర్చిన ఉచిత బస్‌సౌకర్యం

ప్రజాశక్తి- ఆనందపురం : గంభీరం పంచాయతీ, కల్లివానిపాలెం కాలనీ చెందిన మాజీ ఎంపిటిసి ఉప్పాడ సూరిబాబు (సూరిరెడ్డి) 18వ అయ్యప్పపడి దీక్ష చేపట్టిన సందర్భంగా వారి సన్నిధానం నుంచి శబరిమల యాత్రకు బయలుదేరిన 26 మంది అయ్యప్ప దీక్షాపరులకు ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించారు. పదిరోజులపాటు శబరిమల యాత్రకు వెళ్లేందుకు వీలుగా రూ.2లక్షలతో దీన్ని సమకూర్చారు. శుక్రవారం అదే బస్సులో అందరితోపాటు దీక్షావిరమణకు సూరిబాబు బయలుదేరి వెళ్లారు.

ఓటర్ల నమోదు వేగవంతం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతానికి రాజకీయపార్టీల నేతలు సహకరించాలని ఆర్‌డిఒ ఎన్.భాస్కరరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఓటర్ల నమోదు మందకొడిగా సాగుతోందని, ప్రాథమిక సమాచారం ప్రకారం 18ఏళ్లు నిండి అర్హత కలిగిన ఓటర్లు దాదాపు 14వేల మంది ఉంటే కేవలం 1500 'ఫారం ఎ' దరఖాస్తులు వచ్చాయన్నారు. ఓటరుగా నమోదుకు ఇంజినీరింగ్ విద్యార్థులు అంతగా ఆసక్తి కనబరచడం లేదన్నారు. ఈ నెల 6 తర్వాత ఇంజనీరింగ్ కళాశాలల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించి ఓటర్లగా నమోదుపై చైతన్య పరుస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. గతనెల 9న విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా జాబితాలో జిల్లాలోనే అత్యధికంగా

మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

3,,18, 624మంది ఓటర్లు భీమిలి నియోజకవర్గంలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో డూప్లికేషన్ లేకుండా చూడాలని టిడిపి నేత గంటా నూకరాజు సూచించారు. శాశ్వతవలసలు, మృతులపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో వైసిపి నేత ఎం.షణ్ముఖరావు, బిజెపి ప్రతినిధి కె.రామానాయుడు, సిపిఐ నేత రాంబాబు పాల్గొన్నారు.

హరిత సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణ పరిరక్షణ

గీతంలో తేజ ఎయిర్‌క్రాఫ్ట్ రూపశిల్పి డాక్టర్ కె.హరినారాయణ

హరినారాయణను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : సాంకేతిక ప్రగతి మాటున దారుణంగా దెబ్బతిన్న పర్యావరణ పరిరక్షణకు హరిత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవడమే ఏకైక మార్గమని ప్రసిద్ధ వైమానిక సాంకేతిక నిపుణుడు, తేజా ఎయిర్‌క్రాఫ్ట్ రూపశిల్పి, పద్మశ్రీ డాక్టర్ కోటా హరినారాయణ అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'గ్రీన్ అండ్ సస్టైనబుల్ టెక్నాలజీస్' అనే అంశంపై మాట్లాడుతూ, ప్రపంచంలో కాలుష్యం పెరగడానికి థర్మల్ విద్యుదుత్పాదన, పరిశ్రమలు, వాహనాలు, భవన నిర్మాణం ప్రధాన కారణాలన్నారు. రానున్న 50ఏళ్లలో ప్రస్తుతమున్న దానికంటే మూడింతలు ఎక్కవగా పెరగనున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి సంప్రదాయేతర ఇందన వనరుల వినియ్గోగంతో పాటు హరిత భవన నిర్మాణం, విద్యుత్తు వాహనాల వినియోగం, వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువులు, క్రిమి సంహరకాల వాడకాన్ని తగ్గించడం, పరిశ్రమలలో హరిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం అవసరమని సూచించారు. వైమానిక రంగంలోనూ 2.5 శాతం కాలుష్యం నమోదౌతున్న వేళ, హైడ్రోజన్ ఇందనం వాడకంపై అధ్యయనాలు జరుగుతున్నాయన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టంమాట్లాడుతూ, రక్షణ రంగం, ఔషధ రంగం, అంతరిక్ష రంగాలలో దేశం స్వయంసంవృద్ధి దిశగా అడుగులేస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కోటా హరినారాయణను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్ సన్మానించారు.

ముగిసిన బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు

ప్రజాశక్తి -ములగాడ: సెయింట్ ఆన్స్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్లడ్ గ్రూపింగ్ పరీక్ష శిబిరంశుక్రవారంతో ముగిసింది. సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు, సెయింట్ జోసెఫ్స్, సరస్వతి స్కూలు విద్యార్థులు 388 మందికి బ్లడ్ గ్రూపింగ్ నిర్వహించారు. ౖ సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్ మాట్లాడుతూ బ్లడ్ గ్రూపింగ్ తెలుసుకోవడం ద్వారా ఆపద సమయంలో స్వీయ ప్రయోజనంతోపాటు ఇతరులకు సాయపడేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ అధ్యాపకులు నదియా, అంకిత, కల్యాణి, ముంతాజ్, సువర్ణ పాల్గొన్నారు. క్యాంపు నిర్వాహకులను ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి అభినందించారు.

'ఆకార్'లో రామునాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నేత ముక్కా రామునాయుడు జన్మదిన వేడుకలను. సుజాతనగర్ ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. పెందుర్తి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ఆకార్ బాలికల సమక్షంలో కేకు కట్ చేశారు. బాలికలకు పండ్లు, స్వీట్లు కేకు అందజేశారు. ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఽంతో ఆనందంగా ఉందని రామునాయుడు అన్నారు. ఎపిసిసి అధ్యక్షునిగా రుద్రరాజు నియామకంలో పార్టీకి పునరుత్తేజం వచ్చిందని, పూర్వవైభవం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు విన్నకోట రాము పాల్గొన్నారు

ఘనంగా సునీల్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి యువజన విభాగం నాయకుడు సునీల్ పుట్టినరోజు వేడుకలను ఉత్తర నియోజకవర్గం వైసిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి శ్రేణుల సమక్షంలో సునీల్ కేక్ కట్ చేయగా, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు సునీల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్‌రాజు, డైరెక్టర్స్ ఆళ్ళ శివ, గణేష్, నూకరాజు, కిరణ్ పాల్గొన్నారు.

రూ.31లక్షలతో హాస్టల్ భవన మరమ్మతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డులోని ప్రభుత్వ సమీకృత బిసి బాలికల వసతిగృహం మరమ్మతు పనులకు జిల్లా బిసి సంక్షేమాధికారి కె శ్రీదేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. చిప్పాడ దివీస్, సిఎస్ఆర్ నిధులు రూ 31 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డివి రమణమూర్తి, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్, శేఖర్ బాబు, పైడినాయుడు పాల్గొన్నారు.

యుజిడి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదో వార్డు రాజీవ్ గృహకల్ప కాలనీలో జోనల్ కమిషనర్ రాము శుక్రవారం పర్యటించారు. 98వ బ్లాక్ వద్ద భూగర్భ డ్రైనేజీ సమస్యతో తాము పడుతున్న ఇబ్బందులను స్థానికులు జెడ్‌సి దృష్టికి తెచ్చారు. యుజిడి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీలో శానిటరీ నాప్‌కిన్స్, గుడ్డలు,ఇతర అడ్డుకుపోయే చెత్తాచెదారాన్ని వేయకుండా స్థానికులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిఎంఒ శాస్త్రి, స్థానిక నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో జరిగిన పలు దొంగతనాలను క్రైమ్ పోలీసులు ఛేదించారు. నాలుగు కేసుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపించారు. ఎంవిపి పోలీసుస్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో క్రైమ్ డిసిపి జి.నాగన్న ఆయా కేసుల వివరాలను వెల్లడించారు. ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలోగల జాలరిపేటలో నివాసముంటున్న ఉప్పిలి తాతాజీ తన ఇంటి తాళాలు పగలగొట్టి 27 గ్రాముల బంగారం చోరీ అయిన్నట్లు గత నెల 24న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విధంగా రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోగల అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట వద్ద ఓ ఇంట్లోని 31.9 గ్రాముల బంగారం, పాత జైలు రోడ్డు, ఉమెన్స్ కాలేజ్ వద్ద ఒక పల్సర్ బైక్‌ను దొంగిలించినట్టు ఫిర్యాదులు నమోదయ్యాయి. విచారణ అనంతరం పాత నేరస్తుడు విజయవాడ రైల్వే క్వార్టర్స్ సత్యనారాయణపురానికి చెందిన బొట్టేటి రాజశేఖర్ ఈ దొంగతనాలకు పాల్పడినట్టు గుర్తించారు. ఈ మూడు కేసులకు సంబంధించి చోరీలకు పాల్పడ్డ నిందితుడిని కెఆర్‌ఎం.కాలనీ శ్మశానవాటిక వద్ద అదుపులోకి తీసుకున్నారు. 58.9 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

మరో కేసుకు సంబంధించి స్టీల్‌ప్లాంట్ పోలీసుస్టేషన్ పరిధిలోగల ఉక్కు నగరానికి చెందిన అల్లు రాముడమ్మ గత నెల 23న బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా సెక్టార్-3, ఉక్కు నగరం వద్ద స్కూటీపై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తుల తాడును ఓ వ్యక్తి తెంపుకు పోయాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఆటో నడిపే అనకాపల్లిలోని కొత్తూరు నరసింగరావుపేటకు చెందిన పొట్నూరు రాజేష్ ఈ దొంగతనం చేసినట్టు గుర్తించారు. అనంతరం అతడిని స్టీల్‌ప్లాంట్, సెక్టార్-8, సాయిబాబా గుడి దగ్గర అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనున్న రెండు తులాల బంగారు పుస్తెలతాడు, రూ.15 వేలు నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నాలుగు కేసులను ఛేధించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ద్వారక క్రైమ్ సబ్ డివిజన్ సిఐ బండారు రమణమూర్తి, తూర్పు సబ్ డివిజన్ సిఐ ఎర్రం నాయుడు, తదితరులను డిసిపి అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న అక్కరమాని విజయ నిర్మల

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు ఇందిరాగాంధీనగర్‌లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులు రూ.20లక్షలతో చేపట్టే రోడ్లు, కాలువల నిర్మాణానికి విఎంఆర్‌డిఎ ఛైర్మన్, వైసిపి తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల శుక్రవారం శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి, మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్ల అప్పలరాజు, సీనియర్ నాయకులు రజని, వైదా నారాయణరావు, కెఆర్‌వి.ప్రసాద్, ఎఇ అప్పాజీ పాల్గొన్నారు.

సీతమ్మధార : 25వ వార్డు సీతంపేట, గణేష్‌నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులు రూ.20లక్షలతో బిటి రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు గురువారం జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 25వవార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర ఛైర్మన్ కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఎఇ శ్రీరామమూర్తి, సానబోయిన సురేష్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-కంచరపాలెం: ప్రజా సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి నానాజీ అన్నారు. గురువారం వార్డు పరిధిలోని ఆశవానిపాలెంలో 71 వాంబే గృహాల్లో ప్లంబింగ్, ఇతర నిర్వహణ పనులకు రూ.పది లక్షల జివిఎంసి నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. వాటర్ సప్లయ్ ఎఇ కర్రి గణేష్, వర్స్ ఇన్‌స్పెక్టర్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఐక్య ఉద్యమం

ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు

మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర నేత నరసింహారావు

ప్రజాశక్తి- వేపగుంట: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు రక్షణకు ఐక్యంగా పెద్దఎత్తున ఉద్యమిద్దామనిఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శ ఆర్‌వి. నరసింహారావు పిలుపునిచ్చారు. గోపాలపట్నంలో నిర్వహించిన ఎపి భవన నిర్మాణ కార్మికసంఘం (సిఐటియు) ఆరవ మహాసభల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, 2009లోనే పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యం చేసే కుట్రలకు పూనుకుందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ మాట్లాడుతూ, సంక్షేమబోర్డులోని నిధులను సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం దారి మళ్లించడంతో పాటు వరకు కార్మికులకు రావాల్సిన క్లెయిమ్స్, సౌకర్యాలన్నింటినీ నిలిపేసి తీరని అన్యాయం చేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన ఇసుక పాలసీతో ఇసుక కొరత సృష్టించి కార్మికులకు పనిలేకుండా చేసిందన్నారు. కరోనాతో జీవనోపాధి కోల్పోయిన కార్మికులను కనీసం ఆదుకునే చర్యలు చేపట్టలేదన్నారు. కార్మికుల సంక్షేమబోర్డు పరిరక్షణ, హక్కుల సాధనకు పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందుగా మహాసభలను పురస్కరించుకుని ,గోపాలపట్నం పెట్రోల్ బంక్ నుంచి సిఐటియు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు మహాసభల్లో గౌరవాధ్యక్షులుగా బి.వెంకటరావు, పి.అనసూయ అధ్యక్షులుగా, బి.శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగా, కె.నర్సింగరావు, డి.ప్రకాశ్, కె.అప్పల నాయుడు, డి.గోపాలకృష్ణ, ఎ.రమణ, జె.రాము నాయుడు, టి.శ్రీను, పి.రాజశేఖర్, ఆర్.మల్లేష్, కోటేశ్వరరావులతో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు.

450 మందికి వైద్య పరీక్షలు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- గాజువాక : గంగవరం పోర్ట్ ఆధ్వర్యంలో గంగవరం, దిబ్బపాలెం, జాలర్ పల్లిపాలెంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 450 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా 200మందికి కంటి పరీక్షలు నిర్వహించి, గంగవరం పోర్టు తరపున ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. వైద్యులతోపాటు గంగవరం పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని వాలిమేరక, జుత్తాడ అంగన్వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆర్‌డిఒ హుస్సేన్, తహశీల్దార్ ఆనంద్, ఎంఇఒ పైడపునాయుడు, ఎంపిడిఒ, ఎంపిపి మదుపాక నాగమణి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు.పిల్లల హాజరు, ఇతర రికార్డులను ఎంపిపి నాగమణి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పిల్లలతో సహపంక్తి భోజనం చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యాప్రమాణాలు, సమస్యలపై పరిశీలన చేశారు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి- మధురవాడ : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వ పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఏడో వార్డు డాక్‌యార్డ్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, మధురవాడ నగర పాలెంరోడ్డులో గడపగడపకు ప్రభుత్వంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది, ఉద్యోగుల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఇచ్చిన హామీలతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌సి బి.రాము, 7వ వార్డు వైసిపి అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, నక్క ప్రకాష్., గోపి, రజని పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ

విరాళాన్ని అందజేస్తున్న దాత అప్పలరాజు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో నిత్యాన్నదానానికి గాజువాక ప్రాంతానికి చెందిన కె.అప్పలరాజు శుక్రవారం రూ 1,00,100 విరాళాన్ని అందజేశారు, దేవాలయంలోని 'మే ఐ హెల్ప్ యు' కౌంటర్‌లో విరాళమొత్తాన్ని అందజేశారు. విరాళదాతకు ఆలయ సిబ్బంది స్వామి దర్శనాన్ని కల్పించి ప్రసాదాలు అందించారు. అనంతరం విరాళ మొత్తానికి బాండును అందజేశారు

రజకుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ధర్నా నిర్వహిస్తున్న రజకులు

ప్రజాశక్తి -మాధవధార : రజకుల సంక్షేమం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆంధ్ర ప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం విశాఖ నగర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం 50వ వార్డు తెన్నేటి నగర్ పార్క్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. సంఘం విశాఖ నగర అధ్యక్షులు తలాడ రాము అధ్యక్షతన జరిగిన ఆందోళనలో జిల్లా కార్యదర్శి ఎం ఈశ్వరరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో 50 వేలు మంది రజకులు ఉన్నారని. అయితే దోబీ ఘాట్లు, వత్తి స్థలాలు, వత్తి పరికరాలు లేక రజకులు ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. సొంత ఇల్లు, స్థలాలు లేక నగరంలోని పలు అపార్ట్మెంట్లో పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో రజకులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వారికి సామాజిక రక్షణ ప్రభుత్వాలు కలించాలని డిమాండ్ చేశారు. 50ఏళు నిండిన రజకులకు పింఛన్లు, జగనన్న చేయూత పథకం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో టి రాము, ఎం ధనుంజయ్, టి సోమయ్య, బి రాము, ఎం.రామారావు, ఒ.దుర్గారావు, వి పుణ్యవతి, కె.సింహాద్రి పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ విద్యార్థిని ఏంజెలిన్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ఏంజెలిన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్స్ కాలేజ్ ఫర్ ఉమెన్ విద్యార్థిని బి.ఏంజెలిన్ ఎపి స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎపిఎస్‌సిహెచ్‌ఇ)ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. విద్యార్థులను సమాజసేవకు ప్రోత్సాహించే లక్ష్యంతో మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఈ అవార్డుల్లో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్‌వాలంటీరుగా విశేష సేవ చేసిన ఏంజెలిన్ రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో నిలిచి, ఎపిఎస్‌సిహెచ్‌ఇ ఎక్స్‌లెన్ అవార్డు కింద రూ.పదివేలు నగదు, ప్రశంసాపత్రం, మెమొంటోతోపాటు 'బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ 2022' పురస్కారాన్ని ముఖ్యమంత్రి జగన్ చేతులమీదుగా మదనపల్లిలో జరిగిన కార్యక్రమంలోఅందుకున్నారని డాక్టర్ సినియర్ షైజీ తెలిపారు. అవార్డు గ్రహీత ఏంజెలిన్స్‌ను అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొ.హరనాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి, డాక్టర్ పికె.జయలక్ష్మి, డాక్టర్ జె.నిర్మల, డాక్టర్ అరుణాదేవి, డాక్టర్.మేరీ అనుపమ (ఏంజెలిన్ తల్లి), సీనియర్ మేరీ, సీనియర్.హేమ, డాక్టర్.మౌసమీశంకర్ ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఏంజెలిన్‌ను అభినందించారు.

సాగర్‌నగర్‌లో ఇదేం ఖర్మ రాష్ట్రానికి ప్రారంభం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -మధురవాడ : వైసిపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, అరాచక పాలనను నిరసిస్తూ, టిడిపి అధిష్టానం పిలుపుమేరకు శుక్రవార 8వ డివిజన్ సాగర్‌నగర్‌లో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డ్ టిడిపి అధ్యక్షులు చెట్టుపల్లి గోపి, పార్టీ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి బోడేపూడి పెదబాబు ఆధ్వర్యంలో ఇంటింటా వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలను వివరిస్తామన్నారు. వైసిపి నుంచి రాష్ట్రాన్ని రక్షించి, చంద్రబాబును సిఎంను చేయడం, తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగాఈ కార్యక్రమం చేపడుతున్నట్లు నేతలు ప్రకటించారు .కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, ఉపాధ్యక్షుడు సారిపల్లి వెంకట్రావు, ఉప్పులూరి గోవిందరావు, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో రమేష్‌కు రెండు స్వర్ణాలు

పతకాలతో రమేష్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆంధ్ర విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ - 22 లో ఐదు వేలు, వెయ్యి మీటర్ల పరుగు పందెం పోటీల్లో స్థానిక ఎస్‌వివిఎల్‌ఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిఎ సెకెండియర్ విద్యార్థి వంతల రమేష్ రెండు బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ గౌరీశంకర్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. డిస్కస్ త్రోలో కళాశాల విద్యార్థికి కాంస్య పతకం వచ్చిందన్నారు. క్రీడాపోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన రమేష్‌నుకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె విద్యాసాగర్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ గౌరీ శంకర్, హెచ్‌ఒడి, ఆర్ ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ ఎం రమణప్రసాద్, ఐక్యుఎసి కోఆర్డినేటర్ రాజేశ్వరరావు అభినందించారు.

బీమా తక్షణ సాయం అందజేత

సాయం అందజేస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి- గాజువాక: జివిఎంసి 65వ వార్డు, భానోజీతోట రోడ్డు నంబర్ 5లో ఇటీవల ప్రమాదశాత్తూ మరణించిన సిరిపురపు గోవింద్ కుటుంబాన్ని శుక్రవారం వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పరామర్శించారు. వైఎస్సార్ బీమా కింద మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరు కాగా, తక్షణ సాయం కింద రూ.పది వేల రూపాయలను గోవింద్ భార్య లక్ష్మికి అందజేశారు .కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ ప్రమాదంలో మరణించడం బాధాకరమని, బాధిత కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాగిశెట్టి శ్రీనివాస్, ఎన్‌ఎమ్‌ఆర్ మూర్తి, మాధురి, ఎల్‌వి.రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు

పంచకర్లకు అభినందన

రమేష్‌బాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును అతని నివాసంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. వైసిపి నేతలు గోవిందు, దానపులు, రమణ, చిత్ర, డా వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు ఇప్పించండి

ప్రజాశక్తి- ఆనందపురం: గ్రామ పంచాయతీల ఖాతాలకు కేంద్రప్రభుత్వం జమ చేసిన 15వ ఆర్థికసంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించుకుందని, దీంతో పంచాయతీల్లో అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారం కుంటుబడిందని అంతర్జాతీయ హ్యూమన్ రైట్స్ కార్యదర్శి కె.శివ ప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పివివి. ప్రసాదరావు పట్నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లాక్కొన్న నిధులను తిరిగి పంచాయతీలకు ఇప్పించాలని రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నర్సింహరావుకు కోరారు.

శుక్రవారం విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. దీనిపై జివిఎల్ స్పందిస్తూ, పంచాయతీల నిధులను లాక్కొనే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, అవి వాపసు అయ్యేలా కృషి చేస్తానన్నారు.

అల్పపీడనంతో వరి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి- కె.కోటపాడు, బుచ్చయ్యపేట

బంగాళాఖాతంలో ఈ నెల 5న అల్పపీడనం ఏర్పడి, అది వాయుగుండంగా మారనుందని, దీని ప్రభావంతో కోస్తా తీరంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు, ఆకాశం మేఘావృతమై ఉన్న నేపథ్యంలో వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి పంట పూర్తిగా పండడంతో కోతలు కోసి పొలంలో ఆరబెట్టగా, కొన్ని ప్రాంతాల్లో పంట కోతకు సిద్ధంగా ఉంది. ఇటువంటి సమయంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడితే ఎంతో శ్రమటోర్చి పండించిన వరి పంట నీటిపాలవుతుందన్న భయాందోళనలతో రైతులు ఉన్నారు. ఈ సంవత్సరం కె.కోటపాడు మండలంలో 2245 హెక్టార్లలో వరి వేశారు. విత్తనాలు వేసిన దగ్గర నుండి పంట చేతికి వచ్చేవరకు రైతుకు దినదిన గండంగానే ఉంటుంది. అధిక శాతం రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసిన సాంబామసూరి, ఆర్‌జెఎల్, స్వర్ణ, ఇంద్ర తదితర వరి విత్తనాలు వేశారు. వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో మెట్ట ప్రాంతాల్లో కూడా వరి పంట వేయడం జరిగింది. ఈ సంవత్సరం కొన్ని రకాల వరి పంటలకు ఎక్కువగా తెగుళ్ల సోకటంతో వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేశారు. అయినా కొద్ది మేరకు దిగుబడి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కె.కోటపాడు మండలంలో 30శాతం వరకు పంటలు పూర్తిగా పండి పోవడంతో కోత కోసి పంట పొలాల్లో ఆరబెట్టారు. బుచ్చయ్యపేట మండలంలోని రాజాం, నీలకంఠాపురం, ఆర్.శివరాంపురం, తైపురం, పెద్దమదిన, బుచ్చయ్యపేట, కందిపూడి తదితర గ్రామాల్లో వారం రోజులుగా రైతులు వరి పంటను కోశారు. వరి పంట కోసిన వెంటనే కుప్పలుగా పెడితే వరి పనలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. అయితే రెండు రోజుల నుండి వాతావరణంలో మార్పులు కనిపిస్తుండటంతో పంట పొలాల్లో ఉన్న చేలను కుప్పలుగా పెట్టడానికి రైతులు పరుగులు తీస్తున్నారు. అల్పపీడనం వాయుగుండంగా మారి వర్షాలు కురిస్తే వరి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు వాతావరణంపై ముందుగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించాలని పలువురు కోరుతున్నారు.

కె.కోటపాడు చౌడువాడలో పొలంలోనే వరి చేను కుప్పలు పెడుతున్న రైతులు

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

'సింహాద్రి'లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సింహాద్రి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు జివివి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఇయుఆర్.భాస్కర రావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి కళాశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఫ్రెషర్స్ డేని పురస్కరించుకొని విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, త్రో బాల్ వంటి పలు క్రీడా నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల యాజమాన్యం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముత్యాల సతీష్ తదితరులు

17న ఎంవిఆర్ ఆధ్వర్యాన శ్రీనివాస కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు, సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో ఈనెల 17న నరసింగరావుపేట స్వగృహంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తనయుడు సతీష్ తెలిపారు. స్థానిక విజయ రెసిడెన్సీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సుమారు లక్ష మంది భక్తులు ఈ కల్యాణ ఉత్సవంలో పాల్గొంటారని తెలిపారు. వారికి కావలసిన రవాణా సదుపాయం, భోజనం, వసతి సదుపాయం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రాజకీయ పార్టీల నేతలతో పాటు, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. ఇప్పటికే సుమారు 250 బస్సులు ద్వారా పలువురిని పలు యాత్రలకు పంపడం జరిగిందన్నారు. 17న కల్యాణ ఉత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు హాజరై తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన నాయకులు కరణం శ్రీనివాసరావు, వేగి వెంకటరావు, నాయుడు, ప్రణీత, గిరిబాబు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో వరి పంట కోత ప్రయోగాన్ని అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట దిగుబడులను అంచనా వేయటానికి నిర్దేశించిన పంట కోత ప్రయోగాలు చేస్తున్నట్లు తెలిపారు. రబీ సీజన్లో రైతాంగానికి అవసరమైన అపరాలు, వేరుశెనగ, నువ్వు మొదలైన విత్తనాలను తక్షణమే రైతులకు అందించాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎస్.వసంత కుమారి, మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, వివిఎ రమాదేవి పాల్గొన్నారు.

వరి కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు గనిశెట్టి, శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి - పరవాడ

పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందిన పరవాడలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న సిఐటియు అనకాపల్లి జిల్లా 12వ మహాసభకు సంబంధించి వాల్ పోస్టర్లను ఆ సంఘం జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు తదితరులు శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపైనా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభలో చర్చించి, భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. నేడు కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, కార్పొరేట్ కంపెనీలకు కార్మిక హక్కులను తాకట్టు పెడుతుందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మిక పోరాటాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని, కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని తెలిపారు. పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి 11 ఏళ్లు అవుతున్నా నేటికీ వేతన సవరణ చేయడం లేదని, దీంతో జిల్లాలో 3 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెరగలేదని చెప్పారు. మహాసభ సందర్భంగా ఈ నెల 18న జరుగు బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి స్వరూపరాణి ప్రసంగిస్తారని, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

డ్రైనేజీ అవుట్ లెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ తదితరులు

కొప్పాక డ్రైనేజీ అవుట్‌లెట్ స్థల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 84వ వార్డు పరిధి కొప్పాకలో డ్రైనేజీ అవుట్ లెట్ స్థలాన్ని ఆ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు ఆధ్వర్యాన అధికారులు శుక్రవారం పరిశీలించారు. మురుగునీరు పోయేందుకు అవుట్ లెట్ లేకపోవడంతో డ్రైనేజీ నీరు కొప్పాక ప్రధాన జంక్షన్లో నిలిచిపోవడంతో దుర్గంధం వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. మురుగునీరు కారణంగా రాకపోకలకు స్థానికులు సిబ్బంది పడుతున్నారని, దోమల తీవ్రత పెరిగిందని, డయేరియాతో తరచూ గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో కార్పొరేటర్‌తో పాటు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్మోహన్‌రావు, ఎఇ చిరంజీవి, డిఇ వేణుగోపాల్ పరిశీలించారు. అవుట్ లెట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇ సుమిత్ర, టిడిపి నాయకులు సాలాపు మోహన్, విల్లూరి రామచంద్రరావు, బోయిన మురళి, గోపాలరావు, వానపల్లి బాబురావు, గిరి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి అమర్‌నాథ్


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -అనకాపల్లి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు సంక్షేమ ఫలాలను పూర్తిస్థాయిలో అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. మండలంలోని సుందరయ్య పేట గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.23.34 లక్షలతో నాడు-నేడు కింద నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని, ఎన్ఆర్‌డిడబ్ల్యుపి నిధులు రూ.10.30 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని మంత్రి ప్రారంభించారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

మండలంలోని కుంచంగి గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అంబేద్కర్ స్ఫూర్తితో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లిపల్లి శోభ, ఎంపిటిసి సభ్యుడు రాపేటి వెంకటేశ్వరరావు, వెంకుపాలెం, శంకరం, సుందరయ్యపేట సర్పంచులు రాపేటి నాగేశ్వరరావు, పసుపులేటి లక్ష్మి రామకృష్ణ, బాధపు తాతారావు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బిసి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చోడవరం : ఈ నెల 7న విజయవాడలో జరుగు బీసీ మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు రాష్ట్రంలోని బీసీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరవుతారని చెప్పారు. ప్రభుత్వం బీసీల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, వీటిని ప్రజలకు వివరించేందుకు ఈ మహాసభ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాసు, వైసిపి నాయకులు పల్ల నర్సింగరావు, గాడి అప్పారావు, బి.ఈశ్వరరావు, గంగరాజు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ఉప ముఖ్యమంత్రి బూడిని సన్మానిస్తున్న క్రిస్టియన్లు

ఘనంగా ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : పిఎఫ్ఆర్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు బిషప్ టైటస్ గొర్లె ఆధ్వర్యంలో శుక్రవారం దేవరాపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరుణామయుడు అయిన ఏసుక్రీస్తు లోక రక్షకుడని పేర్కొన్నారు. డాక్టర్ గుంటి అరుణ పాల్, జాన్ హెన్రీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, జెడ్‌పిటిసి కర్రి సత్యం, రెవ ఆంథోని రాజ్, రెవ సైమన్, సీఐ ఎస్.తాతారావు, ఎస్సై డి.నాగేంద్ర, వైసిపి నాయకులు డాక్టర్ సింహాచలం నాయుడు, బూరె బాబురావు, కెవి.రమణ పాల్గొన్నారు.

పింఛను అందజేస్తున్న వైసిపి నాయకులు

డయాలసిస్ రోగికి పింఛను మంజూరు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామానికి చెందిన కిడ్నీ సంబంధి వ్యాధితో బాధపడుతున్న డయాలసిస్ పేషెంట్ రాయి శివాజీకి పింఛను మంజూరు చేసినట్లు వైసీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు యడ్ల నాయుడు తెలిపారు. శుక్రవారం లబ్ధిదారునికి పింఛను డబ్బులు అందజేశారు. ఇటీవల తమ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ దృష్టికి శివాజీ తన సమస్యను తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డిఎంహెచ్ఒతో ఫోన్‌లో మాట్లాడి పింఛను మంజూరు చేయించడంతో శివాజీ కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఐడి బాబు, గండి ముత్యాలనాయుడు, పైల రామునాయుడు, బత్తిన వెంకట్, ఐ.గోపి, సిరపరపు నవీన్, సిరపరపు ఝాన్సీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని అరబ్బుపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అగ్రికల్చర్ సహాయకులు రవిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటా ధాన్యం రూ.2040కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు దళారుల చేతిలో మోసపోకుండా రైతు భరోసా కేంద్రాల్లో అమ్మకాల చేయాలని, 21 రోజుల్లో రైతుల అకౌంట్లో డబ్బులు పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బొడ్డేడ బుజ్జి రైతులు నాయుడు, రామకృష్ణ, అప్పలనాయుడు నాగేశ్వరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసరావు

బస్సుల్లేక అవస్థలు

- వంతెన మరమ్మతులతో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- వడ్డాది నుంచి బడి బస్సులు నడపాలని విజ్ఞప్తి

వడ్డాదిలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-వడ్డాది

వడ్డాది వంతెన శిథిలమైన నేపథ్యంలో బస్సులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ వంతెన శిథిలమైన తర్వాత నర్సీపట్నం నుండి చోడవరం వెళ్లే బస్సులు వడ్డాది వంతెన అవతల వెంకటేశ్వరస్వామి ఆర్చి వరకే నడుస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే విద్యార్థులు, ప్రయాణికులు అక్కడ నుండి వడ్డాది జంక్షన్ వరకు నడుచుకుంటూ వచ్చి ఇక్కడ మరో బస్సు ఎక్కాల్సి వస్తుంది. వంతెన ఖానాలు కుంగిన మొదటిలో వడ్డాది నుంచి చోడవరం వరకు ప్రత్యేక బస్సులు నడిపేవారు. వాటిని ఇప్పుడు నిలిపివేశారు. దీంతో చోడవరం, అనకాపల్లి కళాశాలలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు బస్సులు కోసం గంటలు తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మాడుగుల నుండి చోడవరం వైపు వెళ్లే బస్సులు తక్కువగా ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. ఉదయం 10 గంటల వరకు ఒక్క బస్సు కూడా రావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులున్న కొంతమంది ఆటోల్లో వెళ్తుండగా, మరి కొంతమంది సమయం మించి పోవడంతో తిరిగి ఇంటికి వెళ్ళిపోతున్నారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ స్పందించి ఉదయం 9గంటల సమయంలో వడ్డాది నుండి చోడవరం వరకు బడి బస్సులు వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రమాదకర విద్యుత్ వైర్లు మార్పు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్న విషయంపై ప్రజాశక్తిలో ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని దిబ్బిడిలోని తురకవాని చెరువు గట్టుపై విద్యుత్ వైర్లు వేలాడడంతో రైతుల ఇబ్బందులు, చిన్నప్పన్నపాలెం జగనన్న కాలనీలో ఇంటి పైభాగం నుండి విద్యుత్ వైర్లు ఉండటం వల్ల లబ్ధిదారుడు పోతు రాము ప్రహరీ గోడ నిర్మాణానికి ఇబ్బందులు పడడంపై ప్రజాశక్తి నవంబర్ 22న కథనాన్ని ప్రచురించిన విషయం విధితమే. దీనికి స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు నవంబర్ 23వ తేదీన దిబ్బిడి తురకవాని చెరువు గట్టుపై గల విద్యుత్ వైర్లను తొలగించి మరొకవైపునకు ట్రాన్స్‌ఫార్మర్ బిగించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు చర్యలు చేపట్టారు. శుక్రవారం చిన్నప్పన్నపాలెం జగనన్న కాలనీలో మూడు విద్యుత్ స్తంభాలను రోడ్డు వైపుగా మార్చి, కాలనీలో ఇంటి పైభాగం నుండి ఉన్న విద్యుత్ వైర్లను తొలగించి పక్కనుండి లైన్ ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను తొలగించడంతో కాలనీ నిర్మాణదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా వేసిన విద్యుత్ స్తంభాలు

అనకాపల్లి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

'ఇదేం ఖర్మ'లో మాజీ ఎమ్మెల్యే పీలా సవాల్

ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి

మూడున్నరేళ్ల వైసిపి పాలనలో అనకాపల్లి అభివృద్ధిపై ప్రజల మధ్య చర్చించేందుకు మంత్రి గుడివాడ అమర్నాథ్ సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సవాల్ విసిరారు. స్థానిక గాంధీనగరం అంజయ్య కాలనీలో శుక్రవారం టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బొర్రా నాగరాజుతో కలిసి ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ వైసిపి పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలే అభివృద్ధి చెందారని ఎద్దేవా చేశారు. చెత్తపై కూడా పన్ను వేసే చెత్త ప్రభుత్వం వైసిపి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలవరపు త్రినాథ్, సురేంద్ర, బొద్దపు ప్రసాద్, పిట్ల రాజు, పూడి చిన్నారావు, ఎల్లపు వెంకటరమణ, ఆకుల నానాజీ, ధనుంజయ్, ఆకుల వెంకట అప్పారావు, సూరే సతీష్, పిట్ల హరీష్, పూడి త్రినాధరావు, ముప్పిడి మణికంఠ, దేవి, ఆళ్ల జగన్, కొయ్యలాడ గణేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

యలమంచిలి రూరల్ : ఇదేం కర్మ వాల్ పోస్టర్‌ను స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పప్పల చలపతిరావు, పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, ఇతర నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు, గొర్లె నానాజీ, బొద్దపు రమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- దేవరాపల్లి : యాదవ సంఘం దేవరాపల్లి గ్రామ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక దేవరాపల్లి ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, సంఘం మండల అధ్యక్షులు బంధం అప్పలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఈగల పైడితల్లి, అధ్యక్షులుగా మురికితి శ్రీను, ఉపాధ్యక్షులుగా నమ్మి దేవుళ్ళు, ప్రధాన కార్యదర్శిగా దేవర దేవుళ్ళు, కోశాధికారిగా గోకాడ ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు చల్ల నానాజీ, చల్ల తాతయ్యలు, గోకాడ దేవుడు, మొల్లి సూరి, వారాది బంగారయ్య, మన్నెల అప్పలనాయుడు, గోకాడ శ్రీను, జాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంట వేసుకొని దీక్ష కొనసాగిస్తున్న జనసేన నాయకులు

చలిలో కొనసాగిన 48 గంటల దీక్ష

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది వంతెన పునరుద్ధరణ చేయాలని కోరుతూ జనసేన నాయకులు చేపట్టిన 48 గంటల నిరవధిక నిరాహార దీక్ష చలిలోనూ కొనసాగింది. జనసేన చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు, పార్టీ కార్యకర్తలు నిరాహార దీక్ష కొనసాగించారు. గురువారం రాత్రి కొద్దిసేపు చలిమంటలు కాగి అక్కడే నిద్రపోయారు. శుక్రవారం ఉదయం కాలకృత్యాల అనంతరం నిరాహార దీక్షలో కూర్చున్నారు. పలువురు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను రైతులకు శుక్రవారం ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు పంపిణీ చేశారు. రబీ కాలానికి వేరుశెనగ, మినుములు, పెసలు తదితర విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వేరుశెనగ విత్తనాలు 40శాతం, మినుములు, పెసలు 30శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిని వై.కాంతమ్మ, కార్పొరేషన్ డైరెక్టర్ వి.సింహాచలం నాయుడు, సర్పంచులు చింతల వెంకట సత్యనారాయణ, గూడుపు రాము, చల్ల తాతయ్యలు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖ ఆసుపత్రిలో.. లబ్ధిదారులకు ఫించన్ల అందజేత

ప్రజాశక్తి- కశింకోట : విశాఖలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు ఇద్దరు వాలంటీర్లు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి పింఛన్లు అందజేశారు. కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కర్రి నారాయణ విశాఖ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, సంబంధిత వాలంటీర్ పార్వతి ఆ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. ఎఎస్.పేట గ్రామానికి చెందిన ఎ.అప్పారావు విశాఖ కళ్యాణ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వాలంటీర్ కుమారి అక్కడ పింఛను పంపిణీ చేశారు. ఇద్దరు వాలంటీర్లను గ్రామ కార్యదర్శి ఎన్.సత్యారావు తోటి వాలంటీర్లు అభినందించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని చిన్న అప్పన్నపాలెం గ్రామానికి చెందిన వికలాంగ పింఛనుదారుడు కొల్లివలస కొండబాబును నాలుగు రోజుల క్రితం బైక్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆ గ్రామ వాలంటీర్ కటకం ఉష శుక్రవారం వికలాంగ పింఛను డబ్బులను కెజిహెచ్‌కు వెళ్లి అందజేశారు. దీనిపై కొండబాబు హర్షం వ్యక్తం చేశారు.

హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ నూతన పాల సేకరణ కేంద్రాన్ని టిడిపి నాయకులు చెట్టుపల్లి అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీకి పాలు పోసిన రైతుల పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ రూ.50కు, ఆడపెయ్యి పుట్టుటకు కృత్రిమ గర్భధారణ రూ.500కు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డెయిరీ రీజనల్ క్వాలిటీ మేనేజర్ కె.నరసింహమూర్తి, రీజనల్ ఐటి మేనేజర్ కె.వెంకటేశ్వరరావు, పాడి రైతులు గుర్రం సత్తిబాబు, మండపాక జగ్గారావు, గుర్రం పార్వతి, మామిడి శ్రీను, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

పాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు అప్పలనాయుడు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, గణేష్, బాబూరావు

ప్రజాశక్తి-గొలుగొండ: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ తెలిపారు. మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామ పంచాయతీలో శివారు జమ్మాదేవిపేట, నర్సింగపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వీల్‌చైర్‌లోనే గ్రామంలో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో 99 శాతం హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైస్ ఎంపిపిలు ఆదినారాయణ, జక్కు నాగమణి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైసిపి ప్రధాన కార్యదర్శి పత్తి రమణ, స్థానిక సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, సేవాదళ్ అధ్యక్షులు రమేష్, మండల సర్పంచ్‌ల అధ్యక్షులు శ్రీను, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే...

కొత్తకోట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్ర వారం రావికమతం మండలం జెడ్ బెన్నవరం పంచాయతీ కిత్తంపేట, బెన్నవరం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు పై అరా తీశారు. అర్హత కలిగిన వారికీ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తమకు ఇల్లు మంజూరు చేయాలని కిత్తంపేట గ్రామానికి చెందిన పలువురు కోరగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ ఏఇ రామచంద్రరావును ఆదేశించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరగా రోడ్లు, కాలువలు, తాగునీటి సౌకర్యం నిమిత్తం రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల రాజు, డిసిఎంఎస్ డైరెక్టర్

పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

గుమ్ముడు సత్యదేవ్, ఎంపిడివో వెంకన్నబాబు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎస్ఐ విభూషణ రావు, గ్రామ సర్పంచ్ పెదిరెడ్ల రామలక్ష్మి, ఉప సర్పంచ్ దేముడమ్మ, వైసీపీ నాయకులు, కంచిపాటి జగ్గారావు, శీలం శంకరరావు, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: బీసీలను 'బ్యాక్ బోన్ క్లాస్'గా సీఎం జగన్ మార్చారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబూరావు అన్నారు. మండలంలోని పెదఉప్పలం, చినఉప్పలం గ్రామాలలో గడప గడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగనన్న చేదోడు పథకం కింద బీసీలకు ప్రభుత్వం రూ.10వేల చొప్పున నేరుగా వారి అకౌంట్లోనే జమ చేసిందన్నారు. ప్రతి ఏటా సొంత మగ్గాలు ఉన్న నేత కార్మికుల బ్యాంకు ఖాతాలకు రూ. రూ.24,000 నేరుగా జమ చేస్తుందన్నారు. మత్స్యకార భరోసా ద్వారా 300 కోట్లు అందించారన్నారు. వైఎస్సార్ చేయూత' 5391.92 కోట్ల రూపాయలు పెట్టుబడిగా అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాబురావు

అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల భవన నిర్మాణాలకు శుక్రవారం ఎమ్మెల్యే గొల్ల బాబురావు శంకుస్థాపన చేశారు. అప్పలపాయకరావుపేట, వెంపాడు కొత్తూరు, ఉపమాక పంచాయతీ శివారు సారిపల్లిపాలెం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీవిద్య, సూపర్వైజర్లు హైమావతి సత్యవతి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, వేంపాడు పిఎసిఎస్ పర్సన్ ఇన్ చార్జ్ అయినంపూడి మణి రాజు, వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి, సూరకాసుల గోవింద్, గొర్ల బాబురావు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చుక్కపల్లిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- చీడికాడ: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని చుక్కపల్లి గ్రామం లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పెదగొగాడ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ అప్పారావునాయుడు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ యస్.గోవిందరావు, గ్రామ సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ, ఆశా కార్యకర్తలు, యూత్ సభ్యులు, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స యు. దేవి, రత్నకుమారి పాల్గొన్నారు.

4న జనసేన సమావేశం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కొంతలం హైస్కూల్ ఆవరణలో ఈ నెల 4న జనసేన పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు త్రినాధ్, బలిజి మహారాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు, పిఎసి మెంబర్ కోన తాతారావు, భీమిలి ఇన్‌చార్జ్ పంచకర్ల సందీప్, యలమంచిలి ఇన్‌చార్జ్ సుందరపు విజయ్‌కుమార్, విశాఖ నార్త్ ఇన్‌చార్జ్ పి.ఉషాకిరణ్, అనకాపల్లి ఇన్‌చార్జ్ పి.భాస్కరరావు తదితరులు హాజరవుతారన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురంలో వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను పిఆర్ డిఇ ప్రసాద్, జెఇ అరుణకుమారిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

వ్యకాస మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మాడుగుల: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరాటపు నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భవాని కోరారు. శుక్రవారం మండలంలోని బొడ్డరేవు గ్రామంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డిసెంబర్ 8, 9, 10 తేదీలలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో మహాసభలు జరగ నున్నాయని, ఈ సభలకు మాజీ ఎంపీ బృందా కారత్, ఆల్ ఇండియా అధ్యక్ష , కార్యదర్శులు విజయ రాఘవన్, బి.వెంకట్ హాజరు అవుతున్నారని తెలిపారు. ఈ సభలలో ఉపాధి హామీ పథకం లో 200 రోజుల పని కల్పించాలని, ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాల భూమి, అర్హులైన పేదలకు ఐదు సెంట్ల స్థలం, ఐదు లక్షలతో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రజా పంపిణీ ద్వారా 15 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ, , వితంతు, వృద్ధాప్య, వికలాంగులు, ఒంటరి మహిళలకు రూ.5000 పింఛను చెల్లించాలని తదితర డిమాండ్లపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాసు, విజయశాంతి, నాగార్జున, ఈశ్వరరావు. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేతలు

విఆర్ఒల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ: ఏపి విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ (విఆర్వో) అసోసియేషన్ గొలుగొండ మండల కమిటీ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా జి.సీతారామస్వామి, ఉపాధ్యక్షులుగా వివిఎన్.రాంబాబు (శ్రీధర్), కార్యదర్శిగా సిహెచ్. రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎస్.పద్మ, కోశాధికారిగా ఎం.చిరంజీవి, కార్యవర్గ సభ్యులుగా బి.మణికంఠ కుమార్, వి.రాజుబాబులు ఎన్నికయ్యారు. డివిజన్ కమిటీ సభ్యుడుగా కోడి అప్పారావు, సిహెచ్. ఎరుకునాయుడులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు జిఎస్ఆర్ స్వామి, వి.గోవర్ధనకుమార్, కె.అప్పారావు, వి. నారాయణమూర్తి, సిహెచ్ ఎరుకు నాయుడు, ఎస్.కుమారి, సిహెచ్‌వి మోహన దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

వాలంటీర్ సేవాగుణం

కెజిహెచ్‌కుకు వెళ్లి పింఛన్ అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రావణాపల్లి గ్రామ పంచాయతీలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వాలంటరీ వ్యవస్థకు వన్నీ తెచ్చిన రావణాపల్లి వాలంటరీ ఇసంపెల్లి సత్యనారాయణ. గత పది రోజుల నుంచి విశాఖపట్నంలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కొల్లు అప్పలనాయుడుకు వృద్ధాప్య పింఛను ఆసుపత్రికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా వాలంటీర్‌కు అప్పలనాయుడుకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



కెజిహెచ్‌లో పింఛను ఇస్తున్న వాలంటీర్

పరిశీలిస్తున్న అధికారులు

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని బంగారమ్మపేట లో సంపద తయారీ కేంద్రాన్ని ఇంచార్జ్ ఎంపీడీవో పి. వెంకటనారాయణ పరిశీలించారు. గ్రామంలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించి సంపద సృష్టించు కోవాలన్నారు. గ్రామాన్ని ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింగరావు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న ఎంపిటిసి రాంబాబు

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం రబీ సాగుకు సంబంధించి మినుము, పెసర విత్తనాలు రైతులకు పంపిణీ చేపట్టారు. , బికేపల్లి గ్రామంలో సచివాలయం వద్ద ఎంపీటీసీ సభ్యులు పెట్ల రాంబాబు చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు:: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ప్రతి పార్లమెంట్ నియోజక వర్గ స్థాయిలో ఒక స్కిల్ కాలేజ్ ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్ సహకారంతో జిల్లాలో అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో అరకు వ్యాలీలో స్కిల్ కాలేజ్ యువజన శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ స్కిల్ కాలేజ్ లో హౌస్ కీపింగ్ మేనేజర్, ఫుడ్ ఔట్లెట్ మేనేజర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు.

నిరసన చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ: బకాయి వేతనాలు తక్షణమే ఇవ్వాలని మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో పారిశుధ్య కార్మికులు శుక్రవారం సచివాలయం ఎదుట ఆందోళన చేశారు. సుమారు రెండు సంవత్సరాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశామని, దీంతో గత ఆరు నెలల కిందట నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ వేతనాల చెల్లింపునకు హామీ ఇచ్చి, ఇంత వరకు ఆ హామీ నెర వేర్చలేదన్నారు. తక్షణమే తమకు ఇవ్వాల్సిన బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఐద్వా మహిళా నాయకులు

హింస లేని సమాజాన్ని నిర్మిద్దాం

- ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : హింసలేని సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక నాయకురాలు రాధా రాణి పిలుపునిచ్చారు. స్థానిక ఉమెన్స్ మెయిన్స్ కాలేజీలో ఐద్వా ఆధ్వర్యంలో డిసెంబర్ 12 వరకు హింసా దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలపై మానసికంగానూ, భౌతికగాను ఎన్నో దాడులు జరుగుతున్నాయని, వీటిని ఎదుర్కొనే సత్తా చిన్ననాటి నుండే తెలుసుకోవాలన్నారు. ప్రతి సమస్యను దాని మూలాలను శాస్త్రీయుతతో ఆలోచన చేయాలన్నారు. సమస్య నుండి భయపడి పారిపోకుండా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

ఐద్వా నాయకురాలు గౌరీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చట్టాలు నిర్వీర్యం చేసి హింసను ప్రేరేపించే విధంగా చేస్తోందని విమర్శించారు. నర్సీపట్నంలో హింసాత్మక చర్యలు వెలుగుచూస్తున్నాయని, మత్తు పదార్థాలకు, గంజాయికి అలవాటు పడ్డ యువత చెడుతోవలో ప్రయాణిస్తున్నారన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని తహ సిల్దారు జానకమ్మ, ఎంపీడీవో చంద్ర శేఖర్ తెలి పారు. శుక్రవారం మండల సమావేశం మందిరంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిర్మాణాలు వేగవంతం చేయాలని నిర్దేశించిన గడువులో పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు ఏమైనా ఉంటే వాటిని అధికారులు పరిష్కరించాలని, అదేవిధంగా వారికి బిల్లులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ జగదీశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులు సిబ్బంది, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

నేవీ విన్యాసాలు.. అదరహో..

తూర్పు నౌకాదళం ఆధ్వర్యాన ఈ నెల 4న జరుగనున్న నేవీ డేను పురస్కరించుకుని శుక్రవారం ఆర్‌కె.బీచ్‌లో తలపెట్టిన నేవీ రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. చూపరులను ఒళ్లు గగుర్పాటుకు గురి చేశాయి. వైమానిక విన్యాసాల ప్రదర్శన అలరించింది. యుద్ధనౌకల ప్రదర్శన, కమాండో ఆపరేషన్, ఫైట్ జట్టర్స్ ద్వారా బాంబులు సంధించడం, టెర్రరిస్టులచే బంధింపబడ్డ వ్యక్తిని ఆర్మీ కమాండోలు కాపాడటం, నేవీ ఓడలపై హెలీకాప్టర్ ల్యాండింగ్, ప్యారాషూట్ వంటి విన్యాసాలను నావికులు ప్రదర్శించారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

సముద్రంలో బాంబు నుంచి చెలరేగుతున్న మంటలు

యుద్ధ విమానాల విన్యాసాలు



వీక్షిస్తున్న నగర వాసులు

విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న నౌక

ప్యారాచూట్ విన్యాసాలు

ప్రభుత్వ పథకాలను విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలి

అనకాపల్లి జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల

ప్రజాశక్తి రావికమతం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉచితంగా అందిస్తున్న సేవలు, సదుపాయాలను విభిన్న ప్రతిభా వంతులు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి. శకుంతల కోరారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభ వంత విద్యార్థులకు రగ్గులను రావికమతం భవిత కేంద్రంలో శుక్రవారం పంపిణీ చేశారు. చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన రెడ్డి సన్యాసినాయుడు, చోడవరం గ్రామానికి చెందిన జూరెడ్డి ప్రకాష్‌లు పది వేల రూపాయలు విలువ చేసే 60 రగ్గులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి. శకుంతల మాట్లాడుతూ, రగ్గులను వితరణ చేసిన రెడ్డి సన్యాసినాయుడు, ప్రకాష్‌లను అభినందించారు. దాత రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతులకు సేవ చేయడం గొప్ప అదృష్టమని అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రన్నింగ్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, డ్రాయింగ్, లాంగ్ జంప్ వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రాము, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వికలాంగులకు రగ్గులు ఇస్తున్న శకుంతల, దాతలు

రైతుల్లో చినుకు భయం

6 నుంచి వర్ష హెచ్చరికతో దిక్కు తోచని స్థితిలో సాగుదారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా ప్రధానంగా రైతులు సాగు చేసే వరి పంట దాదాపు అన్ని గ్రామాల్లోనూ కోత దశకు చేరుకున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల కారణంగా రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈనెల 6 నుండి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేయడంతో దిక్కు తోచని స్థితిలో రైతన్నలు ఉన్నారు. పలు గ్రామాల్లో వరి పంట కోతలు జరుగుతుండగా, కొన్ని ప్రాంతాల్లో పంట పూర్తిగా పండటంతో వాతావరణ హెచ్చరికల కారణంగా కోతలు కోసేందుకు వెనకాడుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు చాలామంది చిన్న, సన్నకారు రైతులు కావడంతో పంట పొలాలు మిషన్లతో కోసే అవకాశం లేదు. దీంతో, అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

పారిశుధ్యం మెరుగునకు కృషి

ప్రజాశక్తి-నాతవరం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ సాగిని లక్షణమూర్తి సూచించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో స్థానిక సర్పంచులకు, ఎంపీటీసీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపిడిఒ యాదగిరిశ్వరావు మాట్లాడుతూ, . గ్రామ పంచాయ తీలు అభివృద్ధి, వివిధ శాఖల పనితీరుపై తెలుసు కోవాలన్నారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించుకునేందుకు ప్రతి శాఖ దోహద పడుతుందన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్‌పై ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యవేక్షించాన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ చిన్నారావు, మండల పంచాయతీ కార్యదర్శి చినబాబు, హుస్సేన్, శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి